
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరు?

కులకచర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ఇలాగేనా..? ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరని ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఈఈ రవీంద్రగౌడ్ అధికారులను నిలదీశారు. కులకచర్లలో వేసిన డబుల్ సీసీ రోడ్డు పనులను గురువారం పరిశీలించారు. సీసీ రోడ్డుకు రెండు వైపులా మట్టి వేయించాలని సూచించారు. ఆయనవెంట ఆర్‌అండ్‌బీ కంట్రోల్ డీఈ ధృవ తార, ఏఈ హైద ర్, స్థానిక ఏఈ మహేశ్ ఉన్నారు.



దోమ మండలం ఊటుపల్లిలో రాత్రి కూడా నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు

మూడో విడత నామినేషన్ల జోరు

రెండో రోజు రాత్రి వరకూ క్యూలోనే అభ్యర్థులు

సర్పంచ్‌లకు 247, వార్డులకు 979 నామినేషన్లు



పరిగి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ తుది విడత ఎన్నికల నామినేషన్ల పర్వం రెండో రోజు గురువారం సాఫీగా సాగింది. పరిగి నియోజవర్గ పరిధిలోని పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు, చౌడాపూర్ మండలాల్లోని పంచాయతీలకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మొదటిరోజుతో పోలిస్తే రెండో రోజు నామినేషన్ల సంఖ్య పెరిగింది. ఐదు మండలాల్లో తుది విడతలో 157 సర్పంచ్ స్థానాలకు, 1,340 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు స్వీకరిస్తున్నారు. రెండో రోజు నామినేషన్ కేంద్రాల వద్ద ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు క్యూలో కనిపించారు. చాలా కేంద్రాల్లో నామినేషన్ల దాఖలు ప్రక్రియ

మిగతా 8వ పేజీలో...

పంచాయతీ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్లు కీలకం

జిల్లా సాధారణ ఎన్నికల పరిశీకురాలు యాస్మిన్ బాషా

వికారాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీకురాలు షేక్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్లు నిబద్ధతతో కేటాయించిన విధులను నిర్వర్తించాలన్నారు. జిల్లాలో మైక్రో అబ్జర్వర్లను కేటాయించిన 98 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా చూడాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి అంశాన్ని పరిశీలించాలని సూచించారు. పోలింగ్ రోజు నిర్వర్తించాల్సిన విధుల గురించి మాస్టర్ ట్రైనర్లు రాంరెడ్డి, కృష్ణారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డీపీవో జయసుధ, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎల్‌డీఎం యాదగిరి, బీసీడబ్ల్యువో మాధవరెడ్డి పాల్గొన్నారు.



₹150 కోట్లు



జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో ఖర్చు అంచనా

పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడడం లేదు. ఒక్క గ్రామానికే కదా ఎన్నికలు.. ఖర్చు ఏముంటుంది అనుకుంటే పొరపాటే.. స్థోమతకు మించి రూ.లక్షలు ఖర్చు చేస్తేనే అభ్యర్థి పోటీలో ఉన్నట్లు లెక్క. జిల్లా వ్యాప్తంగా రూ.150 కోట్లకు పైగా అభ్యర్థులు ఖర్చు చేస్తారని అంచనా.. పోటీలో ఉండే వ్యక్తి ఎంత మంచి వారు అయినా ఖర్చు చేయనిది ఓట్లు పడే పరిస్థితులు గ్రామాల్లో కానరావడం లేదు. పలు చోట్ల ఏకగ్రీవాలైనా అవీ ముందస్తు హామీల మేరకే జరిగాయి. వెయ్యి ఓటర్ల కంటే తక్కువ ఉన్న గ్రామాల్లోనూ ఒక్కో అభ్యర్థి పది లక్షలకు పైగా ఖర్చు చేసేందుకు సిద్ధమవుతుండటం గమనార్హం.

- గెలుపు కోసం ఖర్చుకు వెనుకాడని అభ్యర్థులు
- లక్షలుంటేనే పోటీలో ఉన్నట్లు లెక్క
- ఒక్కో గ్రామంలో ఖర్చు రూ.20లక్షల పైనే..
- అప్పుల కోసం పరుగులు తీస్తున్న అభ్యర్థులు
- జిల్లాలో మొత్తం 594 గ్రామ పంచాయతీలు



పరిగి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. ఇప్పటికే మొదటి, రెండో విడత నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా మూడో విడత నామినేషన్లు జరుగుతున్నాయి. ఎన్నికల్లో పోటీ పడే అభ్యర్థులు ఇప్పటికే విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. సర్పంచ్‌కు పోటీ చేసే అభ్యర్థి ఖర్చు ఐదు వేలలోపు జనాభా ఉన్న గ్రామాల్లో అయితే లక్షన్నర, ఆపై ఉంటే రెండున్నర లక్షలు ఖర్చు చేయాలనే నిబంధన ఉంది. ముందు అనుచరుల మద్దతు కూడగట్టుకునేందుకే రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే కుల సంఘాలు, యూత్‌ల సభ్యులతో అభ్యర్థులు ఒప్పందాలు చేసుకున్నారు. ఇక ఓటర్లు సైతం ఓటుకెంత అనే ధోరణే పల్లెల్లో ఎక్కువ కనిపిస్తోంది. వీటికి మించి దావతులు, సమీకరణలు, భోజనాలు, మద్యానికే ఖర్చు తడిసి మోపెడవుతుందని

మిగతా 8వ పేజీలో...

శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు గుర్తింపు గర్వకారణం

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మోహన్‌కృష్ణ



ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలను సన్మానిస్తున్న మోహన్‌కృష్ణ, చెన్నయ్య

శామీర్‌పేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు గుర్తింపు రావడం జిల్లాకే గర్వకారణమని మాల మహానాడు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మోహన్ కృష్ణ అన్నారు. కేంద్ర హోంశాఖ ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా శామీర్‌పేటను గుర్తించిన సందర్భంగా గురువారం స్టేషన్‌లో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, సీనియర్ నాయకులు మురళి, రాజు, బాలేష్, వెంకటేశ్, బోయిని శివ, బోయిని రఘు, బాల్‌రాజ్‌లతో కలిసి ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు, కానిస్టేబుళ్లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు క్రమశిణతో ప్రజల సమస్యలను పరిష్కరించడం వల్లే గుర్తింపు సాధ్యమైందని పేర్కొన్నారు. ఆధునిక నేర పరిశోధన పద్ధతులు, ప్రజలతో నిరంతర అనుసంధానం పోలీస్ వ్యవస్థకు విశ్వాసాన్ని పెంచాయన్నారు. భవిష్యత్తులో శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు మరిన్ని అవార్డులు, రివార్డులు రావాలని ఆకాంక్షించారు.

శరవేగంగా విలీన ప్రక్రియ

జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాలుగా బల్దియాలు

రికార్డులు స్వాధీనం చేసుకున్న అధికారులు.. మున్సిపాలిటీల స్థానంలో జీహెచ్‌ఎంసీ బోర్డులు



ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు స్వాధీనం చేసుకుంటున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

మేడ్చల్/మేడ్చల్ టౌన్/కీసర రూరల్/ఘట్‌కేసర్/శామీర్‌పేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జీహెచ్‌ఎంసీలో రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని 27 మున్సిపాలిటీల విలీన ప్రక్రియ ముగిసింది. విలీనంపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన జీహెచ్‌ఎంసీ ఆర్వీ కర్ణన్ ఆయా మున్సిపాల్టీల్లో రికార్డులు స్వాధీనం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు బుధ, గురువారాల్లో రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాల్లోని మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ కార్యాలయాల బోర్డులు తొలగించి వాటి స్థానంలో జీహెచ్‌ఎంసీ బోర్డులు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్లను అప్‌గ్రేడ్ చేస్తూ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషన్లుగా నియమించారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో డిప్యూటీ కమిషనర్లు రికార్డులు స్వాధీనం చేసుకోవడంతోపాటు ప్రత్యేకంగా రికార్డ్ ప్రొఫార్మా రూపొందించారు. 27 మున్సిపాల్టీల్లో డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితాను

మిగతా 8వ పేజీలో...



దమ్మాయిగూడ మున్సిపాలిటీ పేరును తొలగించి జీహెచ్‌ఎంసీగా మారుస్తున్న దృశ్యం

ఇక గ్రేటర్ పరిధిలోనే పాలన



జీహెచ్‌ఎంసీ పరిధిని విస్తరించడంతో మున్సిపాలిటీలు గ్రేటర్ పరిధిలో కలిశాయి. ఇకనుంచి అంతా గ్రేటర్ పరిధిలోనే పాలన కొనసాగుతుంది. జీహెచ్‌ఎంసీలో విలీనమైనందున ప్రజలు ఆందోళన చెందొద్దు. సేవల్లో ఎలాంటి అంతరాయం, తేడాలు ఉండవు. జీహెచ్‌ఎంసీ నార్మ్స్ ప్రకారం పన్నుల చెల్లింపుల్లో మార్పులు ఉంటాయి. గ్రేటర్‌లో కలవడమంటే అభివృద్ధికి నాంది పలకడమే..

- జ్యోతి, తూంకుంట సర్కిల్ డిప్యూటీ కమిషనర్

సొంత పార్టీ నుంచి ఒక్కరే ఉండేలా..

- సర్పంచ్ బరిలో ఒక్కరికే చాన్స్
- పార్టీ నుంచి ఓట్లు చీలకుండా యత్నాలు
- గ్రామ నాయకులతో విస్తృత చర్చలు
- అధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పావులు



7

‘ఓటు చోరీ’ని విజయవంతం చేయాలి

» డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్



కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను కలిసిన బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓటు చోరీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. గురువారం కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్‌తో స్థానిక నేతలతో కలిసి వజ్రేశ్‌యాదవ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ పిలుపుమేరకు చేపట్టిన ఓటు చోరీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 8 నాటికి ప్రతి మండలంలో ఓటు చోరీపై పది వేలకు తగ్గకుండా సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ఓటు చోరీకి పాల్పడి అధికారం చెలాయిస్తుందని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఓటు చోరీపై పోరాటాన్ని ఉధృతం చేస్తున్నారన్నారు. గ్రేటర్‌లో విలీనమైన స్థానిక సంస్థల వార్డుల విభజన ప్రక్రియ జనవరిలో పూర్తవుతుందని తెలిపారు. స్థానిక నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మామిండ్ల ముత్యాల్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పాంబండ గిరి ప్రదక్షిణలో భక్తులు

భక్తిశ్రద్ధలతో పాంబండ గిరి ప్రదక్షిణ

కులకచర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ గిరి ప్రదక్షిణను గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. దత్త పౌర్ణమిని పురస్కరించుకొని పాంబండ గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. దీంతో పాంబండ క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. ప్రతి నెలా పౌర్ణమిన గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య, అర్చకులు దశరథం, పాండుశర్మ, అమరేందర్, నిర్వాహకులు నర్సింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



పరిగిలో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న రామకృష్ణ

మహా సభలను విజయవంతం చేయాలి

» సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

పరిగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న సీఐటీయూ మహా సభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. మహా సభలకు సంబంధించి బుధవారం పరిగి పట్టణంలో మునిసిపల్ కార్మికులతో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులను యాజమాన్యం చేతుల్లో బానిసలుగా మార్చే కుట్ర చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కిష్టయ్య, కార్మికులు రమేశ్, ప్రశాంత్, రాజశేఖర్, మల్లేశ్, కిష్టయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కొడంగల్ మున్సిపల్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. హైదరాబాద్-బీజాపూర్ హైవేలో చేపట్టిన డివైడర్ పనుల్లో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కొడంగల్ మున్సిపల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం కొడంగల్ పట్టణంలోని అతిథి గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. ఎప్పటిలోగా నిర్మాణ పనులను పూర్తి చేస్తారని అధికారులు, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారి సురేందర్, తదితరులు ఉన్నారు.



అతిథి గృహం పనులను పరిశీలిస్తున్న వెంకట్‌రెడ్డి



రోశయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి

మేడ్చల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ సీఎం దివంగత నేత రోశయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా గురువారం మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్‌లో ఘనంగా నివాళులర్పించారు. పలువురు జిల్లా అధికారులు రోశయ్య చిత్రపటంకు పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి దామోదర్‌రెడ్డి, డీఈఓ విజయకుమారి, డీఆర్‌డీఓ సాంబశివరావు, డీటీఓ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామికవాడల స్థలాలు అమ్ముకునే కుట్ర


నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ జోన్‌ల స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం హిల్ట్ చట్టం పేరుతో అమ్ముకునే కుట్ర చేస్తోందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆరోపించారు. హిల్ట్ బిల్లును నిరసిస్తూ గురువారం మేడ్చల్ పారిశ్రామిక వాడ వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆందోళన చేపట్టింది. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి హైదరాబాద్ చుట్టూ గత ప్రభుత్వాలు వేలాది ఎకరాల్లో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడలకు సంబంధించిన భూములను అమ్ముకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నడం దురదృష్టకరమన్నారు. పారిశ్రామిక వాడలున్న స్థలాలు చాలా వరకు ప్రభుత్వ స్థలాలని, వాటిని పరిశ్రమల పేరిట తక్కువ ధరకట్టి పారిశ్రామిక వేత్తలకు కేటాయించిందన్నారు. ఈ స్థలాలకు ప్రస్తుతం భారీ ధర పలుకుతుండడంతో కుట్ర పూరితంగా అమ్ముకునేలా హిల్ట్ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ స్థలాల్లో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ భూములను అమ్ముకునే వీలు కల్పిస్తూ తెచ్చిన కొత్త చట్టాన్ని ప్రతీ ఒక్కరు వ్యతిరేకించాలని, ప్రజల ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క పౌరుడిపై ఉందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు వీధిన పడే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. శంబీపూర్ రాజు మాట్లాడుతూ... కుట్ర పూరితంగా ఇండస్ట్రియల్ జోన్ స్థలాలను విక్రయించేందుకు హిల్ట్‌ను అమలు పరుస్తున్నారన్నారు. పరిశ్రమల స్థలాలను విక్రయించి డబ్బులు ఆర్జించే కుట్రకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, భాస్కర్ యాదవ్, దయానంద్, రాజ మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌గౌడ్, నడికొప్పు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీతో 'రియల్' మోసం

- హిల్ట్ పాలసీ రద్దు చేసే వరకూ పోరాటం
- దేశ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణం
- ఎమ్మెల్యే పి.సబితారెడ్డి


కాటేదాన్ పారిశ్రామికవాడలో కార్మికులతో మాట్లాడుతున్న సబితారెడ్డి

రాజేంద్రనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ పేరుతో రూ.5లక్షల కోట్ల భారీ కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతోందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. హిల్ట్ పాలసీ కుట్రను ఎండగట్టేందుకు రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ పారిశ్రామికవాడలో శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం.కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, గంథ్రాలయ సంస్థల మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్, బీఆర్ఎస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్‌తో కలిసి పర్యటించారు. కాటేదాన్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇండస్ట్రియల్ ల్యాండ్స్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని సబితారెడ్డి ఆరోపించారు. రిజిస్ట్రేషన్ ఫీజును 30శాతం చెల్లిస్తే పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గం అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న 22 పారిశ్రామిక వాడల్లో సుమారు 9వేల ఎకరాల భూముల యాజమాన్య మార్పునకు తెచ్చిన జీవో నంబరు 27ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హిల్ట్ చట్టంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కాటేదాన్ ఫ్యాక్టరీల్లోని కార్మికులు తమ సమస్యలను సబితకు చెప్పుకున్నారు. పరిశ్రమలను తరలిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. తెలంగాణ రాష్ట్రం వస్తే తమ బతుకులు బాగుపడతాయని అనుకున్నామని, జీవో 27తో బతుకులు రోడ్డున పడే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుభాష్‌రెడ్డి, పి.ధర్మారెడ్డి, పి.జీవన్‌దాస్, ముఖ్రమ్‌ఖాన్, జియావుద్దీన్, డి.రమేష్, లక్ష్మీరాజ్ పాల్గొన్నారు.

తాండూరులో ఘనంగా అయ్యప్ప పడి పూజ


పడి పూజ నిర్వహిస్తున్న మహేందర్‌రెడ్డి-సునీతారెడ్డి దంపతులు

తాండూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తాండూరులోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి-సునీతారెడ్డిల కుమారుడు పట్నం రినిష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా జరిగింది. ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మహేందర్‌రెడ్డి దంపతులు పడిలో పాల్గొని పూజలు నిర్వహించారు. తాండూరు పట్టణం, సమీప ప్రాంతాల భక్తులు తరలివచ్చి పూడిలో పాల్గొన్నారు. అన్నదాత రినిష్‌రెడ్డి అభిషేకాలు, చివర పల్లకి సేవ నిర్వహించారు. మహేందర్‌రెడ్డి సునీత దంపతులు, వారి కుమారుడు రినిష్‌రెడ్డి భక్తులకు బిక్షను వడ్డించారు. కార్యక్రమంలో పీసీసీ నాయకుడు కె.పురుషోత్తంరావు, జిల్లా డీసీసీ చీఫ్ ధారాసింగ్, వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, నాయకులు రాజుగౌడ్, మల్కోడ్ రాకేష్, వడ్డె శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, విశ్వనాథ్‌గౌడ్, స్వప్నపరిమళ్, శోభారాణి, పరిమళ, అనురాధ, సంపత్‌కుమార్, శ్రీనివాస్‌చారి, నవాంద్గి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంతో విశ్వశాంతి సాకారం


మహా సభలో మాట్లాడుతున్న శివానంద స్వామి

ఆమనగల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికమార్గం విశ్వశాంతికి దోహదం చేస్తుందని సద్గురు నిత్యాశుద్ధానంద స్వామి కేంద్రం, శ్రీ రామదాత ఆశ్రమ సంస్థాపకులు శివానందస్వామి అన్నారు. ఆధ్యాత్మిక చింతన లేని మనిషికి వినయశీలత ఉండదని పేర్కొన్నారు. ఆమనగల్లులోని వాసవి కల్యాణ మండపంలో గురువారం తృతీయ ఆర్ష వేదాంత విజ్ఞాన మహాసభలు నిర్వహించారు. సభలకు శివానంద స్వామి హాజరయ్యారు. రామదూత ఆశ్రమం ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాలను నిర్వహించారు. శివానందస్వామి మాట్లాడుతూ.. మనిషి భావాలు ఉన్నతంగా ఉంటేనే జీవితంలో ఉన్నతుడవుతాడన్నారు. సమాజంలో అనేక అనర్థాలకు కోరికలు, మనస్సు చంచలత్వమే కారణమన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు యాదయ్య, రామ్మోహన్, శ్రీనివాస్, నర్సింహ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించండి

వికారాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల విధుల నుంచి గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులకు, నిరక్షరాస్య అటెండర్లకు మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి రాములు జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు పీవోలుగా, సీనియర్ ఉపాధ్యాయులకు ఓపీవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారని, ఈ అంశాన్ని పునః పరిశీలించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణకు జిల్లా మినరల్ ఫండ్ నుంచి 40శాతం నిధులు విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారని సందర్భంగా వారు తెలిపారు. ఇదిలా ఉంటే పరిగి మండలంలో ఐదేళ్ల కింద చనిపోయిన అంగన్‌వాడీ టీచర్‌కు పెద్దేముల్ మండలంలో శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలంటూ సమాచారమివ్వడం చర్చనీయాంశంగా మారింది. రిటైర్డ్ టీచర్లు కనకాచారి, పాండురంగయ్య, రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయిన ఉద్యోగికి ఎన్నికల విధులు కేటాయించారని ఫెడరేషన్ నాయకులన్నారు.

'సర్పంచ్‌గా గెలిపిస్తే ఆడపిల్ల పెళ్లికి రూ.10వేలు'

పెద్దేముల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తనను సర్పంచ్‌గా గెలిపిస్తే తండాలో ఆడపిల్ల పెళ్లికి రూ.10వేల సాయం చేస్తానని మండలంలోని కందనెల్లి తండా సర్పంచ్ మహిళా అభ్యర్థి ప్రకటించారు. తనను సర్పంచ్‌గా గెలిపిస్తే పెళ్లికి ఆర్థిక సాయంతో పాటు తండాలో ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాలకు రూ.5వేల చొప్పున ఇస్తామని తెలిపారు. అనారోగ్యానికి గురైన వారికి ఆర్థికసాయం చేస్తానని, ఎల్లవేళలా అందుబాటులో తండావాసులకు సేవచేస్తానని ఆమె పేర్కొన్నారు.

వేంకటేశ్వరాలయంలో కృతిక దీపోత్సవం


దీపాలను వెలిగిస్తున్న మహిళలు, భక్తులు

కొడంగల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కృతిక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వార్లు, శ్రీ వైఖానసస్వామి, అన్నపూర్ణదేవి, గరుడ్మంతుడు, ఆంజనేయస్వామి, యాగశాల, నవగ్రహాలు, వరహస్వామి, ఆలయ గోపురాలకు, ధ్వజస్తంభానికి ఆలయంలో పూజలు చేసిన దీపాలను ఉంచారు.

సాకేత్ ప్రణామాన్ని పరిశీలించిన హైడ్రా


నిరసన తెలుపుతున్న సాకేత్ ప్రణామం హౌజింగ్ సొసైటీ సభ్యులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సొసైటీకి ఈస్ట్ ఫేజ్‌లో ఉన్న గేటును బిల్డర్ మూసే ప్రయత్నం చేస్తున్నాడని గుండ్లపోచంపల్లి సాకేత్ ప్రణామం హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై హైడ్రా స్పందించింది. గురువారం హైడ్రా అధికారులు సాకేత్ ప్రణామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. సొసైటీ వారు చేస్తున్న ఆరోపణలపై కమ్యూనిటీ ఈస్ట్ ఫేస్ గేట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలని హైడ్రా అధికారులతో సొసైటీ సభ్యులు మొరపెట్టుకుని నిరసన చేపట్టారు. ఈస్ట్ ఫేజ్ రోడ్డును చూపించి కాలనీ ప్లాట్లను విక్రయించారని బిల్డర్‌పై ఆరోపించారు. ప్లాట్ల విక్రయాలు పూర్తికాగానే రోడ్డును మూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శేఖర్ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి


డీసీపీ రాజేష్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

శంషాబాద్ రూరల్/షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫరూక్‌నగర్ మండలం కంసాన్‌పల్లికి చెందిన శేఖర్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ అధ్వర్యంలో నాయకులు గురువారం డీసీపీ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. కంసాన్‌పల్లి పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో వార్డు సభ్యుడిగా నామినేషన్ వేసిన శేఖర్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు విత్‌డ్రా చేసుకోవాలని ఒత్తిడి చేశారని, ఒత్తిడిని భరించలేక అతడు ఆత్మహత్య చేసుకున్నాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. శేఖర్‌ను ఆత్మహత్యకు పురికొల్పిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. అలాగే పంచాయతీ ఎన్నికలు సజావుగా సాగేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార కాంగ్రెస్ పార్టీకి పోలీసులు సపోర్టు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయని డీసీపీ దృష్టికి తెచ్చారు. ఎన్నికలు ముగియగానే ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని డీసీపీ హామీ ఇచ్చారని బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, అందె బాబయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్‌తో రఘువీరారెడ్డి భేటీ



ధారూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి గురువారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మీనాక్షి నటరాజన్ ఆహ్వానం మేరకు ఆయన హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆమెను కలిశారు. వికారాబాద్ జిల్లా రాజకీయ పరిస్థితులు, పార్టీ వ్యవహారాల గురించి ఆమె తనతో చర్చించారని రఘువీరారెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కె.లక్ష్మారెడ్డి

కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. ఈ నెల 17న జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కోరారు. గురువారం మీర్కాన్‌పేట, బాచుపల్లి, నేదునూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామస్థులు కలిసికట్టుగా ఓట్లు వేసేలా పార్టీ శ్రేణులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక నాయకులు చర్చించి పార్టీ నుంచి పోటీలో ఒక్కరే ఉండేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి జంగారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి


రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతిని పురస్కరించుకొని షాద్‌నగర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంటి అద్దె భత్యం పెంచాలి : ఉద్యోగుల ఐకాస

హైదరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, కొంగరకలాన్, ఆదిబట్ల మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చేసినందున ఆ ప్రాంతాల ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి అద్దె భత్యం 24శాతానికి పెంచాలని ఉద్యోగ ఐకాస డిమాండ్ చేసింది. 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనంపై చైర్మన్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ డీఏలు విడుదల చేయాలన్నారు.

దోమలో ఆసక్తికర పరిణామం

» కాంగ్రెస్ పార్టీ వారే ఇద్దరు నామినేషన్
» ఒకరికి మద్దతుగా నామినేషన్
కేంద్రానికొచ్చిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి





దోమ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దోమ సర్పంచ్ పదవి జనరల్ కావడంతో అధికార పార్టీ నుంచి సర్పంచ్ అభ్యర్థి ఒక్కరే ఉండాలని పార్టీ నాయకులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. మొత్తానికి పార్టీ అనుకూలురు ఇద్దరు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి బీఆర్ఎస్ మద్దతుతో బుధవారం నామినేషన్ వేశారు. అంతలోనే మాలి శివకుమార్‌రెడ్డికి మద్దతుగా గురువారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నామినేషన్ కేంద్రానికొచ్చి నామినేషన్ వేయించారు. దీంతో ఇప్పటికే పార్టీ నుంచి ఇద్దరు నామినేషన్ వేసినట్లయింది. విత్‌డ్రా తర్వాతే బరిలో ఎందరుంటారో తేలనుంది. స్వమంగా ఎమ్మెల్యేనే వచ్చి మరో వ్యక్తికి మద్దతివ్వడంతో మండల కేంద్రంలో పంచాయతీ రాజకీయం రంజుగా సాగనుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఖాతాల కోసం బ్యాంకులకు పరుగులు

» పాత ఖాతాలతో సరిపెట్టుకుంటే బాగుండేదని అభ్యర్థుల అభిప్రాయం

కులకచర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సర్పంచ్, వార్డులకు పోటీ చేసే అభ్యర్థులు ఖాతాల కోసం బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. నామినేషన్లకు ఒక్క రోజే గడువుండటంతో అభ్యర్థులతో బ్యాంకులు కిటకిటలాడుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో బ్యాంకు కొత్త పొదుపు ఖాతా పాస్ బుక్‌ను సమర్పించాలని ఎన్నికల సంఘం నిబంధన విధించింది. కులకచర్ల మండలంలో 33 పంచాయతీల సర్పంచ్‌లకు, 280 వార్డులకు పోటీచేసే అభ్యర్థులు ఖాతాల కోసం ఎస్బీఐ, టీజీబీ, హెచ్‌డీసీసీబీ, ప్రైవేట్ బ్యాంకులకు తరలొస్తున్నారు. ఇప్పటికే బ్యాంకు ఖాతాలున్నా కొత్తవే కావాలనే నిబంధన విధించడంతో జాతీయ బ్యాంకుల్లో ఉన్న ఖాతాలున్న వారు ఇప్పుడు కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో ఖాతాలు తెరుస్తున్నారు. రిజర్వుడు స్థానాల్లో కుల ధ్రువీకరణ, పంచాయతీ నుంచి నోడ్యూ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉండటంతో వీటికే సమయం వృథా అవుతుందని పోటీచేయాలనుకుంటున్న వారు వాపోతున్నారు. కొత్త సేవింగ్ బ్యాంక్ ఖాతా తెరవాలని అధికారులు సూచిస్తుండటంతో ఇప్పటికే బ్యాంకు ఖాతా ఉన్నచోట కాకుండా వేరే బ్యాంకులో ఖాతా తెరవాల్సి వస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానం కాకుండా పాత అకౌంట్లతోనే ఎన్నికల ప్రక్రియ వరకు వాడేలా చూడాలని కొందరు అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. నామినేషన్ నాటి నుంచి పోలింగ్ వరకు ట్రాన్సాక్షన్లను పాత అకౌంట్ల నుంచి జరిగేలా చూసినా పారదర్శకతకు భంగం వాటిల్లదని అంటున్నారు.



తిరుమలాపూర్‌లో సర్పంచ్ బరిలో నిలిచిన అత్తా కోడలు కుంద్రు చంద్రమ్మ, కుంద్రు సరిత

పంచాయతీ పోరులో అత్తాకోడలు

దౌల్తాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పోరులో అత్తాకోడలి పోటీ రసవత్తరంగా మారింది. మడలంలోని తిరుమలాపూర్ పంచాయతీలో 429ఓట్లు ఉండగా సర్పంచ్ పదవికి ఐదుగురు పోటీ పడుతున్నారు. వారిలో ఒకే కుటుంబానికి చెందిన అత్తాకోడలు కుంద్రు చంద్రమ్మ, కుంద్రు సరిత బరిలో నిలిచారు. గ్రామంలో 8 వార్డులు ఉన్నాయి. వాటిలో నాలుగు ఏకగ్రీవం 4 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. చిన్న పంచాయతీ తిరుమలాపూర్‌లో సర్పంచ్ పదవి ఐదుగురు పోటీలో నిలవడం.. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు పోటీ చేస్తుడడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

నామినేషన్ ప్రక్రియలో ఇబ్బందులు రావొద్దు




కామునిపల్లిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

కులకచర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం మండలంలోని కులకచర్ల, కామునిపల్లిల్లో నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచ్ ఎన్నిక కోసం జారీచేసిన నోటిఫికేషన్ వివరాలను పరిశీలించారు. అధికారులు పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. గడువులోపు నామినేషన్లు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ ఉన్నారు.

వార్డు సభ్యుడి నుంచి ...
ఎమ్మెల్యే వరకు

దివంగత మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి రాజకీయ ప్రస్థానం

» కల్వకుర్తి వార్డు మెంబర్, సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం
» ప్రజాప్రతినిధిగా పంచాయతీ నుంచే ఆరంభం
» ఎమ్మెల్యేగా రెండు సార్లు విజయం



ఎడ్మ కిష్టారెడ్డి(ఫైల్)

ఆమనగల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబంలో జన్మించి పదవులున్నా, లేకున్నా ప్రజా సమస్యలపై కదం తొక్కిన పోరాట యోధుడిగా ఉమ్మడి రాష్ట్రంలో ఖ్యాతి గడించారు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత ఎడ్మ కిష్టారెడ్డి. ఆయన రాజకీయ ప్రస్థానం పంచాయతీ వార్డు సభ్యుడిగానే మొదలైంది. సర్పంచ్, మండల పరిషత్ అధ్యక్షుడిగా పాలనానుభవం గడించి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ప్రజలను అన్నా, తమ్మీ అని పలకరించే కిష్టారెడ్డి ప్రజాఉద్యమాలతో పోరాటాల కిష్టారెడ్డిగా పేర్గాంచారు. కల్వకుర్తికి చెందిన ఎడ్మ రాంచంద్రారెడ్డి, రాధమ్మ దంపతులకు రెండో కుమారుడిగా 1947లో ఎడ్మ కిష్టారెడ్డి జన్మించారు. పీఎస్సీ వరకు చదవారు. వ్యవసాయం, క్రీడలపై మక్కువ. 20ఏళ్ల వయసులోనే సోషలిస్టు పార్టీ బలపర్చిన అభ్యర్థిగా 1970లో కల్వకుర్తి పంచాయతీ వార్డు మెంబర్‌గా పోటీచేసి గెల్చారు. 1973లో జరిగిన ఉపఎన్నికలో కల్వకుర్తి మేజర్ పంచాయితీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఎమర్జెన్సీ సందర్భంగా 1975 డిసెంబరు 31న కల్వకుర్తి గ్రామ సభలో అరెస్టయిన కిష్టారెడ్డి 14నెలలు చెంచల్‌గూడ జైల్లో ఉన్నారు. 1981లో పంచాయతీ ఎన్నికల్లో రెండోసారి మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్ దాసుపై పోటీచేసి ఘన విజయం సాధించారు. 14 వార్డులకు 10 వార్డుల్లో తన ప్యానెల్‌ను గెలిపించుకున్నారు.

సర్పంచ్ పదవే పునాదిగా ఉన్నత పదవులు

కల్వకుర్తి సర్పంచ్‌గా కిష్టారెడ్డి అందించిన సేవలతో ప్రజల్లో గుర్తింపు పొందారు. పంచాయతీలో పారిశుధ్య, తాగునీటి వ్యవస్థకు ప్రాధాన్యం ఇచ్చారు. సోషలిస్టు భావాలు కలిగిన కిష్టారెడ్డి గాంధీజీని ఆదర్శంగా తీసుకొని శ్రమదాన కార్యక్రమాలు చేపట్టారు. రేకుల షెడ్డులో కొనసాగిన పంచాయతీ భవనానికి సొంత భవనాన్ని నిర్మింపజేశారు. వీధి దీపాలు, అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాల భవనాలతో పాటు 250 మంది పేదలకు ఇళ్లు నిర్మింపజేదీరు. భగత్‌సింగ్‌తండా, జయప్రకాశ్‌తండా, రాంనగర్ తండాల్లో వందలాది మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించడంలో భూమిక పోషించారు.

ఎంపీపీగా గెలిచి అసెంబ్లీలోకి ప్రవేశం

సర్పంచ్‌గా ఉండగానే 1985లో అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడారు. అదే సంవత్సరంలో అప్పటి దివంగత మాజీ గవర్నర్ బీసత్యనారాయణరెడ్డి, మాజీ మంత్రి మహేంద్రనాథ్, ఎల్లారెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. ఎన్టీఆర్ ప్రోత్సాహంతో 1986లో కిష్టారెడ్డి మండల పరిషత్ ప్రత్యక్ష ఎన్నికల్లో కల్వకుర్తి ఎంపీపీగా అప్పటి పాలమూరు జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెల్చారు. కిష్టారెడ్డి 1994లో అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా టీడీపీని వీడి అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించారు. 1999 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరి అసెంబ్లీకి పోటీ చేసి ఓడారు. అయినా ప్రజాసమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు, నిరాహారదీక్షలు చేపట్టి ప్రజాభిమానాన్ని పొందారు. కిష్టారెడ్డి 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండో సారి ఎమ్మెల్యేగా గెల్చారు.

బల నిరూపణ పర్వం

» భారీగా జన సమీకరణలు
» ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో అభ్యర్థులు



బొంరాస్‌పేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ముగిసింది. ప్రచారానికి తెర లేసింది. తమ బలాన్ని నిరూపించుకునే పనిలో అభ్యర్థులున్నారు. బొంరాస్‌పేట్ మండలంలోని 35 పంచాయతీలకు ఏడు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. 28 పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులు పోటాపోటీ బలనిరూపణలకు సిద్ధమయ్యారు. ఓటర్లకు తాయిలాలు ప్రకటిస్తూ మందు, విందు, వినోదాలతో పాటు రోజువారీ కూలి డబ్బులు ఇస్తూ గ్రామంలో ఓట్లను కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. డప్పులతో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బొంరాస్‌పేట్‌లో ఓ పార్టీ అనుకూల అభ్యర్థి నామినేషన్ రోజు ర్యాలీగా రాగా దీటుగా మరో పార్టీ బలపర్చిన అభ్యర్థి అంతకు రెట్టింపు మందితో ర్యాలీ నిర్వహించారు.



బొంరాస్‌పేట్‌లో సర్పంచ్ అభ్యర్థుల ర్యాలీ

ఏకగ్రీవ పంచాయతీల్లో
ఉప సర్పంచ్‌ల ఎన్నిక



వీరారెడ్డిపల్లిలో ఉప సర్పంచ్‌ని ఎన్నుకుంటున్న వార్డు సభ్యులు

తాండూరు రూరల్/బషీరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్వార్, రాంపూర్ మీదితండా, వీరారెడ్డిపల్లి ఏకగ్రీవ పంచాయతీల్లో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వార్డు సభ్యులు ఉప సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీచేసి వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ అభ్యర్థి సమక్షంలో బిజ్వార్ ఉపసర్పంచ్‌గా కుర్వ సత్యనారాయణ, రాంపూర్ మీది తండా ఉపసర్పంచ్‌గా విజయబాయి, వీరారెడ్డిపల్లి ఉపసర్పంచ్‌గా యెన్నం కవితలను ఎన్నుకున్నారు. సర్పంచ్ అభ్యర్థుల సమక్షంలోనే ఎన్నుకున్నారని ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏకగ్రీవ సర్పంచ్‌లు పిట్ల అనుసూజ, వెంకట్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సహాయ రిటర్నింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఉప సర్పంచ్‌తో సర్పంచ్ సుమ్మీబాయి, వార్డు సభ్యులు



బిజ్వార్ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన కుర్వ సత్యనారాయణ

బషీరాబాద్ మండలంలో నాలుగు చోట్ల...

బషీరాబాద్ మండలం నంద్యానాయక్‌తండా ఉప సర్పంచ్‌గా రాథోడ్ గోపిసింగ్, బద్లాపూర్ ఉపసర్పంచ్‌గా మంజుల, బాబునాయక్ తండా ఉప సర్పంచ్‌గా సీతారా, హంక్యానాయక్‌తండా ఉపసర్పంచ్‌గా టోప్యానాయ్ ఎన్నికయ్యారు. గురువారం పంచాయతీ కార్యాలయాల్లో ఏకగ్రీవ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో వార్డు సభ్యులు వారిని ఉపసర్పంచ్‌లను ఎన్నుకున్నారు.

'సర్పంచ్' బరిలో సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లు

యాచారం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇదివరకు ప్రజాప్రతినిధులుగా ప్రజలకు సేవలందించిన వారు పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా బరిలో నిలిచారు. గ్రామస్థాయి పదవికి వారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. యాచారం ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా కొప్పు సుకన్య ఐదేళ్లు సేవలందించారు. ఇప్పుడు యాచారం సర్పంచ్ అభ్యర్థిగా బరిలో దిగి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. మండల పరిధిలోని గునగల్ సొసైటీ డైరెక్టర్‌గా గెలిచిన టి.రాజేందర్‌రెడ్డి చైర్మన్‌గా ఐదున్నరేళ్లుగా రైతులకు సేవలందిస్తున్నారు. నేడు గునగల్ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. మంతన్‌గౌరెల్లిలో సొసైటీ డైరెక్టర్ కె.యాదయ్య వైస్‌చైర్మన్‌గా ఉన్నారు. నేడు ఆయన మంతన్‌గౌరెల్లి సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. వీరిలో జనం ఎవరిని ఆదరిస్తారో వేచి చూడాల్సిందే.

సొంత పార్టీ నుంచి
ఒక్కరే ఉండేలా...

» సర్పంచ్ బరిలో ఊరికొక్కరే ఉండాలని నాయకుల మంతనాలు
» పార్టీ నుంచి ఓట్లు చీలకుండా యత్నాలు
» గ్రామ నాయకులతో విస్తృత చర్చలు
» అధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పావులు



కులకచర్ల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సొంత పార్టీకి చెందిన వారిలో పోటీ లేకుండా గ్రామ, మండల నాయకులు అభ్యర్థుల మధ్య రాజీ కుదుర్చుతున్నారు. బుధవారం నుంచి మూడో విడత పంచాయతీ సర్పంచ్, వార్డు ఎన్నికల నామినేషన్లు స్వీకరిస్తున్నారు. గ్రామాల్లో పార్టీకి చెందిన వారిలో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ఇప్పటికే నాయకుల వద్ద ఉంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి సర్పంచ్ పదవులకు ఒక్కో గ్రామంలో ఇద్దరు, ముగ్గురు చొప్పున పోటీపడుతున్నారు. అలాంటి ఆశావహులతో జిల్లా, మండల స్థాయి నాయకులు చర్చలు జరుపుతున్నారు. ఒకే పార్టీకి చెందిన వారిలో ఒకరి కంటే ఎక్కువ మంది పోటీచేస్తే ఓట్లు చీలి సర్పంచ్ స్థానాన్ని కోల్పోయే ఆస్కారం ఉంటుందని తెలియజెబుతున్నారు. ప్రజల్లో బలం ఉన్న వారినే ఎన్నికల బరిలో నిలపాలని పావులు కదుపుతున్నారు. నొప్పించక.. తానొవ్వక అనే విధానంలో చర్చిస్తూ ఈ ఎన్నికల వరకూ అంతా ఏకతాటిపై నడవాలని, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అనుకూల అభ్యర్థులను గెలిపించుకుంటే వచ్చే పరిషత్ ఎన్నికల్లో ఏదో విధంగా అవకాశం కల్పిస్తామని నచ్చచెబుతున్నారు. మొత్తానికి పార్టీ అనుకూల అభ్యర్థి ఒక్కరే పోటీలో నిలిచేలా నాయకులు ఇప్పటి నుంచి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నామినేషన్లు కూడా ఒక్కరే వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా పరిగి నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ కులకచర్ల మండలాధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్‌లు తమ పరిధి గ్రామంల్లో కాంగ్రెస్ బలపర్చే అభ్యర్థులను ప్రతీ సర్పంచ్ పదవికి ఒక్కరే ఉండేలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలాగే బీఆర్ఎస్ నుంచి సైతం నియోజకవర్గ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తమ పార్టీకి చెందిన వారిలో సర్పంచ్ పదవులకు ఒక్కరే పోటీ చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ప్రజా సేవలో కుటుంబీకులు

» మాజీ సర్పంచ్‌గా, జెడ్పీటీసీగా సేవలందించిన ఎమ్మె ఫ్యామిలీ
» ఇప్పుడు సర్పంచ్ బరిలో ఎమ్మె సత్యనారాయణ తల్లి



ఎమ్మె సత్యనారాయణ, మాజీ సర్పంచ్, ఎస్బీ పల్లి



ఎమ్మె శ్రీలత మాజీ జెడ్పీటీసీ



ఎమ్మె యాదమ్మ, ఎస్బీపల్లి సర్పంచ్ అభ్యర్థిని

కొత్తూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవే మా అభిమతం అంటూ ముందుకు సాగుతోంది శేరిగూడభద్రాయపల్లికి చెందిన ఓ రాజకీయ కుటుంబం. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ 2013లో శేరిగూడ భద్రాయపల్లి సర్పంచ్‌గా గెల్చి గ్రామాభివృద్ధికి పాటుపడ్డారు. 2018లో జెడ్పీటీసీ ఎన్నికల్లో కొత్తూర్ స్థానం జనరల్ మహిళకు రిజర్వు కాగా ఎమ్మె సత్యనారాయణ సతీమణి శ్రీలత బీఆర్ఎస్ తరఫున పోటీ గెల్చారు. ఆమె అప్పటి జెడ్పీ పాలకవర్గంలో విద్య, వైద్యం స్టాడింగ్ కమిటీ మెంబర్‌గా పనిచేశారు. స్వగ్రామం పాటు కొత్తూర్ మండల అభివృద్ధికి మాజీ జెడ్పీటీసీ శ్రీలత పాటుపడ్డారు. ప్రస్తుతం శేరిగూడభద్రాయపల్లి సర్పంచ్ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు. దీంతో సత్యనారాయణ తల్లి ఎమ్మె యాదమ్మ బరిలో నిలిచారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన తల్లిని సర్పంచ్‌గా గెలిపించుకుంటానని సత్యనారాయణ చెబుతున్నారు.

బిల్ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



బిల్ కలెక్టర్‌పై ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తొండుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాల అక్రమాలపై బిల్ కలెక్టర్ రాజశేఖర్‌పై స్థానికులు గురువారం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు ఫిర్యాదు చేశారు. తొండుపల్లి పదో వార్డు బిల్ కలెక్టర్ రాజశేఖర్ కొందరు నాయకులతో కలిసి ఇందిరమ్మ కాలనీలో ఖాళీ స్థలాల్లో ఇందిరమ్మ పట్టాలిప్పిస్తామని పేదల వద్ద రూ.లక్షలు వసూలు చేస్తున్నాడని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. 15 సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తున్న రాజశేఖర్ అవినీతికి అడ్డుకట్ట వేయాలని కమిషనర్‌ను కోరారు. నకిలీ పట్టాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో బిల్ కలెక్టర్ అధికారులను తప్పుదోవ పట్టించాడని, దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్లాట్లు కబ్జా చేసిన క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. స్పందించిన కమిషనర్ సుమన్‌రావు విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజయ్యగౌడ్, జయసింహ, శ్రీనివాస్‌యాదవ్, సుధాకర్, నర్సింహ, రాజు, అశోక్ పాల్గొన్నారు.

మనీలా... నన్ను క్షమించు

» నేను చచ్చిపోతున్నా.. పాప జాగ్రత్త
» అప్పులోళ్లూ.. నా భార్యాబిడ్డను ఇబ్బంది పెట్టొద్దు
» భార్యకు సెల్ఫీ వీడియో పంపి భర్త అదృశ్యం
» పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య



మనీల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు



చెరువు గట్టు వద్ద సుందరచారి సెల్ఫీ

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): 'మనీలా నన్ను క్షమించు.. నేను చెరువులో దూకి చచ్చిపోతున్నా... పాప జాగ్రత్త.. నా చావుకు ఎవరూ బాధ్యులు కారు. అప్పులోళ్లూ.. నా భార్య బిడ్డను ఇబ్బంది పెట్టొద్దు.' అంటూ సెల్ఫీ వీడియో భార్యకు వాట్సాప్ చేసి అదృశ్యమైన భర్త ఉదంతమిది. రాయలసీమలోని కదిరికి చెందిన బోనాలా సుందర చారి(40), కొత్తూర్‌కు చెందిన మనీల అలియాస్ కస్తూరి(36)ని పెళ్లి చేసుకొని పరిశ్రమల్లో పనిచేస్తూ షాద్‌నగర్‌లోని రాఘవేంద్ర కాలనీలో ఉంటున్నారు. వీరికి వైష్ణవి అనే ఇంటర్ చదివే కుమార్తె ఉంది. మనీల ఓ మెట్రో హోల్‌సేల్ షాపులో పనిచేస్తుండగా, సుందరచారి ఎలికట్టలోని గ్రానైట్ కంపెనీలో పనిచేసేవాడు. దుబాయ్ వెళ్లి డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో కదిరి ప్రాంతానికి చెందిన మధ్యవర్తులకు డబ్బు ఇచ్చి మోసపోయాడు. దుబాయ్ వెళ్లడానికి పాసుపోర్టు వచ్చిన తరువాత మధ్యవర్తులు మోసం చేశారని తెలుసుకున్న సుందర చారి షాద్‌నగర్‌లో అడ్డాకూలీగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే పనికివెళ్తున్నానని బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన అతడు మధ్యాహ్నం 'నేను చచ్చిపోతున్నా.' అని సెల్ఫీ వీడియోను భార్యకు పంపి మొబైల్ స్విచాఫ్ చేశాడు. దీంతో అతడి భార్య కస్తూరి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంట్లో గొడవలు లేవని, పని దొరకడం లేదన్న ఆవేదనతోనే తన భర్త ఇంటి నుంచి వెళ్లాడని మనీల తెలిపింది. ఇంటి నుంచి రెండు జతల డ్రెస్సులు, సెల్‌ఫోన్ చార్జర్ తీసుకొని వెళ్లినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. మరి సుందరచారి ఎక్కడున్నాడు? ఏమయ్యాడో అన్న ఆందోళనలో ఉన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

పకడ్బందీగా పంచాయతీ ఎన్నికలు

● జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్‌జైన్

వికారాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్‌జైన్ అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఆయన జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు షేక్‌యాస్మిన్ బాషాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు



వికారాబాద్: మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్‌జైన్, పక్కన జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు షేక్‌యాస్మిన్ బాషా

చేశామన్నారు. అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, టీ-పోల్ ఎంట్రీ పూర్తి నరిపోయాయని చెప్పారు. వెబ్‌కాస్టింగ్ కేంద్రాల ఏర్పాటు, మైక్రో అబ్జర్వర్ల నియామకం, బ్యాలెట్ ప్యాకింగ్ తదితర అంశాల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, అదనపు ఎస్పీ రాములు నాయక్, వ్యయ పరిశీలకుడు రమేష్‌కుమార్, ఆర్డీవో వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

చౌడాపూర్: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు సూచించారు. మండలంలోని చౌడాపూర్, మందిపాల్ గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను గురువారం సందర్శించారు. ప్రతీ నామినేషన్‌ను జాగ్రత్తగా పరిశీలించి ఆ తర్వాతే తిరస్కరించాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సోమలింగం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



చౌడాపూర్: నామినేషన్ కేంద్రంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

దోమ: దిర్సంపల్లిలో గురువారం ఎంపీడీవో గ్యమానాయక్ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వోలు అమర్‌నాథ్, ఇన్‌చార్జి ఎంపీవో రాజేశ్, అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గృహిణి అదృశ్యం



నీతు(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓ గృహిణి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ నుంచి లవకుశ ప్రజాపతి భార్య నీతు(20)తో కలిసి బతుకు దెరువు కోసం 8నెలల కిత్రం ఘట్‌కేసర్‌కు వచ్చి కూలీపనులు చేసుకుంటున్నారు. ఈ నెల 3వ తేదీన ఉదయం 8గంటలకు నీతు పనినిమిత్తం బయటకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. సాయంత్రం వరకు రాకపోవడంతో భర్త తెలిసిన వారిని, బంధువులను, మిత్రులను విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం రాత్రి నీతు భర్త లవకుశ ప్రజాపతి ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రూ.150 కోట్లు

(ఐదో పేజీ తరువాయి)

అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడు విడతల్లో ఎన్నికలు

జిల్లాలోని 20 మండలాల్లో 594 పంచాయతీలు ఉండగా మూడు విడతలుగా ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి విడత డిసెంబరు 11న తాండూరు, పెద్దేముల్, బషీరాబాద్, యాలాల్, బొంరాస్‌పేట్, కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల్‌లో ఎన్నికలు జరగనున్నాయి. రెండో విడత 14న వికారాబాద్, ధారూరు, మర్పల్లి, మోమిన్‌పేట్, బంట్వారం, కోట్‌పల్లి, నవాబ్‌పేట్, మూడో విడత 17న పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు, చౌడాపూర్ మండలాల్లో ఎన్నిక ఉ నిర్వహించనున్నారు. గిరిజన తండాలు, చిన్న, చిన్న పంచాయతీల్లో ఏకగ్రీవం చేసేందుకు రూ.లక్షలు ఇచ్చేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. జిల్లాలో దాదాపు 80 నుంచి 100 వరకు పంచాయతీలు ఏకగ్రీవమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఖర్చుకు వెనుకాడని అభ్యర్థులు!

ఐదు వేల వరకు జనాభా ఉన్న గ్రామాలకు రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేయవచ్చనే నిబంధన ఉంది. అయితే ఈ గ్రామాల్లో ఒక్కో అభ్యర్థి కనీసం రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. వెయ్యి ఓట్లు ఉన్న గ్రామాల్లో ఒక్కో అభ్యర్థి రూ.10 లక్షల వరకు ఖర్చు చేసేందుకు పోటీ పడుతున్నారు. చిన్న పంచాయతీ నుంచి పెద్ద పంచాయతీ వరకు రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చు చేస్తారనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో కలిపి అభర్థుల ఖర్చు రూ.150 కోట్లు దాటుతుందని చెబుతుండడం విశేషం.

లొంకక్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తాం



లొంకక్షేత్రంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లొంకక్షేత్రం అభివృద్ధికి కృషిచేస్తానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాళ్ళాపూర్ శివారులో బుధవారం నిర్వహించిన లొంక ఆంజనేయస్వామి ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లొంక క్షేత్రం మహిమాన్వితమని, ఇక్కడ మొక్కులు తీర్చుకుంటే కోరికలు తీరుతాయనే నమ్మకం ఇక్కడి ప్రజల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశరాంరెడ్డి, నాయకులు తావుర్యానాయక్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సంజీవ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కులకచర్ల: దొంగ ఎన్కెపల్లిలో సంజీవ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి సంజీవస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలి

దోమ: మండలంలో పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దోమ గ్రామంలో గురువారం మాలి శివకుమార్‌రెడ్డితో సర్పంచ్ నామినేషన్ వేయించారు ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, వెంకటయ్య పాల్గొన్నారు.

మూడో విడత నామినేషన్ల జోరు

(ఐదో పేజీ తరువాయి)

రాత్రి వరకు కొనసాగింది. ఆయా మండలాల్లో సర్పంచ్ స్థానాలకు 247, వార్డు స్థానాలకు 979 నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులు తెలిపారు.

ఎక్కడెన్ని వచ్చాయంటే..

పరిగి మండలంలోని 32 పంచాయతీల పరిధిలో సర్పంచ్ స్థానాలకు 53, వార్డు స్థానాలకు 191 నామినేషన్లు వచ్చాయి. అలాగే పూడూరు మండలంలోని 32 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 69, వార్డు స్థానాలకు 334 నామినేషన్లు దాఖలయ్యాయి. చౌడాపూర్ మండల పరిధిలో సర్పంచ్ స్థానాలకు 32, వార్డు సభ్యులకు 85 నామినేషన్లు వచ్చాయి. కులకచర్ల మండలంలోని 33 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 51, వార్డు స్థానాలకు 146 నామినేషన్లు దాఖలయ్యాయి. దోమ మండలంలోని 36 పంచాయతీల పరిధిలో సర్పంచ్ స్థానాలకు 42, వార్డు స్థానాలకు 223 నామినేషన్లు దాఖలు చేశారు. ఆఖరి రోజున శుక్రవారం కూడా భారీగా నామినేషన్లు వచ్చే అవకాశం ఉంది. అందుకోసం ఆయా మండలాల్లోని క్లస్టర్లలో అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

సర్పంచ్, వార్డు సభ్యులు ఏకగ్రీవం కావడం హర్షణీయం



ఏకగ్రీవంగా ఎన్నికైన టేకుల్‌కోడ్ సర్పంచ్, వార్డుమెంబర్లను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, నాయకులు

కొడంగల్ రూరల్, డిసెంబరు 4 ఆంధ్రజ్యోతి): 2వ సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికలు 2025లో మొదటి విడతలో టేకుల్‌కోడ్ పంచాయతీ సర్పంచ్ వార్డు సభ్యులు ఏకగ్రీవం కావడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ అన్నారు. కొడంగల్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి దగ్గర గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏకగ్రీవమైన టేకుల్‌కోడ్ పంచాయతీ సర్పంచ్ చింతకింది. రాజు,ఉప సర్పంచ్ సి.పురుషోత్తంరెడ్డి, వార్డుసభ్యులు సరిత, ఎరుకలి సురేష్, మ్యాతరి రాంచెందర్, ఉప్పరి రాము, కంతి శ్యామప్పలను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థులందరూ కలిసికట్టుగా ఏకగ్రీవమయ్యేందుకు కృషిచేయడం శుభపరిణామం అన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా ఉంటూ పనులు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు వెంకటయ్య, అక్కెం పెద్ద భీంరెడ్డి, ఎస్టీసెల్ ప్రెసిడెంట్ తార్యానాయక్, పాండప్ప, గోవర్ధన్‌రెడ్డి, వన్నే బస్వరాజ్, వెంకటప్ప, కిష్టప్ప ఉన్నారు.

కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలి



ముజాహిద్‌పూర్‌లో నామినేషన్ వేసిన అభ్యర్థులతో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు

కులకచర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి గ్రామ అభివృద్ధికి దోహదపడాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీచైర్మన్ బీఎస్. ఆంజనేయులు అన్నారు. ముజాహిద్‌పూర్‌లో గురువారం పార్టీ బలపర్చిన అభ్యర్థులు సర్పంచ్, వార్డులకు నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్నీ గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నీ గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు సర్పంచ్‌లుగా గెలుపొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి చంద్రభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: గౌతాపూర్ గ్రామపంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థిగా అధిష్టానం బలపర్చిన జర్నె సుజనను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జర్నె నాగప్ప కోరారు. గౌతాపూర్ గ్రామంలో గురువారం సుజన తరపున ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివ రుద్రహోమం



పాంబండపై రుద్రహోమంలో భక్తులు

కులకచర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీ గురుదత్త పౌర్ణమి (దత్త జయంతి) సందర్భంగా గురువారం ఉదయం శివ రుద్రహోమంను ఘనంగా నిర్వహించారు. గత పది నెలలుగా ప్రతీ నెల పౌర్ణమి రోజు పాంబండ ఆలయంలో ప్రత్యేక శివ రుద్రహోమం నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ హోమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య దగ్గరుండి పర్యవేక్షించారు. అర్చకులు దశరథం, పాండు శర్మ, అనంతమశర్మ, అమరేందర్ భక్తులతో రుద్రహోమం నిర్వహించారు.

పైలట్ నివాసంలో పడిపూజ

తాండూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి నివాసంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప దీక్ష వహించిన స్వాములు, భక్తుల కోలాహలం మధ్య అయ్యప్ప పడిపూజ కనులపండవగా జరిగింది. రోహిత్‌రెడ్డి నివాసం అయ్యప్పస్వామి ఆలయాన్ని తలపించింది.

శరవేగంగా విలీన ప్రక్రియ

(ఐదో పేజీ తరువాయి)

విడుదల చేస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

విలీన ప్రక్రియ పూర్తి

ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ పరిధిని విస్తరిస్తూ తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టీసీయూఆర్)గా మార్చు చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని 20 మున్సిపాల్టీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు జీహెచ్‌ఎంసీలో విలీనమయ్యాయి. ఈ విస్తరణ గురువారం నుంచి అమలులోకి వచ్చినట్లు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ - 1955లో తాజా ఆర్డినెన్స్‌ల ఆధారంగా జీహెచ్‌ఎంసీలో విలీనమైన మున్సిపాల్టీలు భాగమయ్యాయి. దీంతో జీహెచ్‌ఎంసీ ఇప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్ద అర్బన్ అడ్మినిస్ట్రేటివ్ యూనిట్‌గా మారింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు జారీ చేశారు. ఇప్పటివరకు జీహెచ్‌ఎంసీలో విలీనమైన మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను కూడా జీహెచ్‌ఎంసీ అధికారులు కోరినట్లు డీసీలు తెలిపారు.



ఘట్‌కేసర్: మున్సిపల్ కార్యాలయంలో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు

ఆందోళనలో విలీన గ్రామాల ప్రజలు

మున్సిపాలిటీలు జీహెచ్‌ఎంసీలో కలవడంతో అందులో విలీనమైన గ్రామాల ప్రజలు కాస్త ఆందోళన చెందుతున్నారు. ఘట్‌కేసర్, పోచారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలు ఎల్బీనగర్ జోన్‌లో, నాగారం సికింద్రాబాద్ జోన్‌లో కొనసాగనున్నాయి. ప్రస్తుతం దమ్మాయిగూడ మున్సిపాలిటీకి వెంకట్‌రెడ్డి, నాగారం మున్సిపాలిటీకి భాస్కర్‌రెడ్డి డిప్యూటీ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే మేడ్చల్, గుండ్లపోచంపల్లి కమిషనర్లుగా విధులు నిర్వహిస్తున్న చంద్రప్రకాశ్ రెడ్డి, వెంకట గోపాల్ స్థానికంగా జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్లుగా వ్యవహరించనున్నారు. అయితే జనాలు మున్సిపాలిటీల విధానాలకు అలవాటు పడకముందే జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడతారని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో పట్టణీకరణ చెందిన ప్రాంతాలతో వ్యవసాయాధారిత గ్రామాలు ఎలా పోటీ పడతాయని, ఎలాంటి ఆదాయం లేని గ్రామాల్లో పన్నులు ఎలా విధిస్తారోనని విలీన గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మేడ్చల్: జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫైళ్లు అప్పగిస్తున్న మేడ్చల్ మున్సిపల్ కమిషనర్

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఘట్‌కేసర్: మాట్లాడుతున్న సీఐ బాలస్వామి



మోమిన్‌పేట్: మాట్లాడుతున్న సీఐ వెంకట్

ఘట్‌కేసర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లోగల సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించడం వల్ల పోలీసులు, బ్యాంకులు మోసపోయిన మొత్తం సొమ్మును ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందన్నారు. సైబర్ మోసం జరిగిన మొదటి గంట సమయం అత్యంత కీలకమని గుర్తుచేశారు. వెంటనే 1930కి లేదా సైబర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఫుట్ ఆన్ హోల్డ్‌కు అవకాశం ఉంటుందన్నారు. నిత్యం యూపీఐ, సోషల్ మీడియా, ఉద్యోగాలు, పెట్టుబడులు ఓటీపీ, కష్టమర్ కేర్ వంటి అనేక మోసాలపై 1930కి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. తక్షణ ఫిర్యాదులతో నష్టాలను తగ్గించవచ్చని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.రవికాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్లు ప్రొఫెసర్ జానకీరాములు, శివకేశవరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధారూరు: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పై ధారూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పోలీసులు గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాఘవేందర్, ఇంచార్జీ ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ధారూరు: ధారూరు ఉన్నత పాఠశాలలో సైబర్‌క్రైమ్ అవగాహనలో సీఐ రఘురాములు

మోమిన్‌పేట్: సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మోమిన్‌పేట్ సీఐ వెంకట్ అన్నారు. మండలంలోని మేకవనంపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ సైబర్ సేఫ్టీ బ్యూరో చేపట్టిన ఫ్రాడ్ క ఫుల్ స్టాఫ్ అవగాహన సదస్సులో విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్‌ను అధికంగా వినియోగిస్తున్న నేపథ్యంలో సైబరోనేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్‌చేసి మోసపోవద్దన్నారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల నుంచే వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించే ముందు వారి నేపథ్యాన్ని తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరవింద్, హెచ్‌ఎం గౌరీశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం



కులకచర్ల: పుట్టపహాడ్‌లో నామినేషన్ వేస్తున్న వెంకట్రాములు



కులకచర్ల: వార్డులకు నామినేషన్ వేసేందుకు క్యూలో కూర్చున్న అభ్యర్థులు



చౌడాపూర్: మందిపా క్లస్టర్‌లో నామినేషన్ వేస్తున్న సర్పంచ్ అభ్యర్థి కోకటం శివకుమార్

కులకచర్ల/చౌడాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో వార్డులకు నామి నేషన్ వేసేందుకు గురువారం రాత్రి వరకు అభ్యర్థులు క్యూలైన్‌లో వేచిఉన్నారు. కులకచర్ల క్లస్టర్ పరిధిలో కులకచర్ల, చాపలగూడెం, ఎత్తుకాల్వ తండా, చెరువు ముందలి తండా(ఏ) పంచాయతీల అభ్యర్థులు అక్కడే నామినేషన్లు వేయాల్సి ఉంది. సాయంత్రం 4గంటల తర్వాత నామినేషన్లు వేసేందుకు ఆయా పంచాయతీల నుంచి అభ్యర్థులు రావడంతో వారికి పీవో రాంచందర్ టోకెన్లు జారీ చేశారు. ఒక్కొక్కరిగా నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు లైన్‌లో కూర్చోవాల్సి వచ్చింది. టోకెన్లు జారీ చేసిన 30మంది రాత్రి వరకు నామినేషన్లు దాఖలు చేశారు. అదే విధంగా చౌడాపూర్ మండలంలో గురువారం నామినేషన్ల ప్రక్రియ జోరుగా కొనసాగింది. మొత్తం 24 పంచాయతీలకు సర్పంచ్, 202 వార్డులకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో సోమలింగం తెలిపారు.



పూడూరు: చెన్‌గోముల్‌లో నామినేషన్ వేస్తున్న రైస్‌ఖాన్

పూడూరు: మండలంలో ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. మండలంలో మొత్తం 32 పంచాయతీలు, 288 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. రెండో రోజు గురువారం సర్పంచ్ స్థానాలకు 69 మంది, వార్డు సభ్యుల కోసం 334 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో పాండు తెలిపారు. నేడు(శుక్రవారం) నామినేషన్ల దాఖలుకు చివరిరోజు కావడంతో మరిన్ని మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

కారు టైరుకు రాయి తగిలిందని..

● విద్యార్థిపై చేయి చేసుకుని, తోటి విద్యార్థులతో కొట్టించిన ఉపాధ్యాయుడు

యాలాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి విసిరిన రాయి తన కారు టైరుకు తగిలిందని ఆగ్రహించిన ఉపాధ్యాయుడు అతడిపై చేయి చేసుకుని, అంతటితో ఆగకుండా ఇతర విద్యార్థులతో కొట్టించాడు. ఈ సంఘటన గురువారం యాలాల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో జరిగింది. బాధిత విద్యార్థి తండ్రి లక్ష్మణ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముకుందాపూర్ గ్రామానికి చెందిన వీర రామ్‌ప్రసాద్, మధులు యాలాలలోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నారు. సాయంత్రం వేళలో ఇద్దరు కలిసి ఒక రాయితో ఆట ఆడుకుంటుండగా ఆ రాయి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడి కారు టైరుకు తగిలింది. ఇది గమనించిన కొందరు విద్యార్థులు ఈ సమాచారాన్ని ఉపాధ్యాయుడికి తెలిపారు. దీంతో ఆ ఉపాధ్యాయుడు విద్యార్థి వీర రామ్‌ప్రసాద్‌పై చేయి చేసుకున్నాడు. అంతటితో ఆగకుండా తోటి విద్యార్థులతో కొట్టించాడు. ఈ విషయం తెలుసుకున్న బాధిత విద్యార్థి తండ్రి పాఠశాలకు వెళ్లి సదరు ఉపాధ్యాయుడిని నిలదీశాడు. ఆటలు ఆడుకుంటుండగా కారు టైరుకు రాయి తగిలినంత మాత్రాన తన కొడుకును కొట్టడమే కాకుండా ఇతర విద్యార్థులతో కొట్టిస్తారా? అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై పాఠశాల ఉపాధ్యాయుడిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని బాధిత విద్యార్థి తండ్రి లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం సిద్ధ రామేశ్వర్‌ను వివరణ కోరగా, పాఠశాలలో పిల్లలు కొట్లాడుకోవడం జరిగిందని, సంబంధిత ఉపాధ్యాయుడు ఆ విద్యార్థిపై చేయి చేసుకోలేదని వివరణ ఇచ్చారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

● కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య

యాలాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గిరిజన విద్యార్థిపై తోటి విద్యార్థులతో దాడి చేయించిన ఉపాధ్యాయుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటన సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, దళిత, గిరిజన బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకోవాలని ప్రభుత్వ పాఠశాలకు వస్తే ఉపాధ్యాయులు ఇలాంటి చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు. ఉపాధ్యాయుడిపై ప్రధానోపాధ్యాయుడు చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్ ఎదుట కేవీపీఎస్, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని మల్కయ్య హెచ్చరించారు.

జాప్యం లేకుండా చెల్లింపులు జరగాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి సేకరించే ధాన్యానికి సంబంధించిన చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి పౌర సరఫరాల కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఆయన కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు ఈ సందర్భంగా రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలను వోపీఎంస్‌లో నమోదు చేయించి మిల్లర్ నుంచి రసీదు ఇప్పించాలని కమిషనర్ సూచించారు. ధాన్యం విక్రయించిన రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా చెల్లింపులు జరిగేలా చూడాలని, 2024-25 సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్ చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయీస్ డీఎం మోహనకృష్ణ, డీసీఎస్‌వో సుదర్శన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మీనాక్షీ నటరాజన్‌ను కలిసిన సుధాకర్‌రెడ్డి



మీనాక్షీ నటరాజన్‌తో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు ఎ.సుధాకర్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌ను గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. సుధాకర్‌రెడ్డి డీసీసీ అధ్యక్ష పదవికి పోటీపడగా, ధారాసింగ్‌ను డీసీసీ అధ్యక్షుడిగా అధిష్టానం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తనకు పదవి దక్కకపోవడంతో నిరాశకు గురైన ఆయనను హైదరాబాద్ రావాలని సమాచారం పంపించారు. ఈ సందర్భంగా జరిగిన పరిణామాలతో నిరాశకు గురికావద్దని, పార్టీకి చేసే సేవలకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోలుకుంద సంతోష్‌కుమార్, తదితరులు ఉన్నారు.